# కాకి ముట్టుకుంది

ఊరేగింపు బ్రహ్మాండంగా సాగుతోంది. ముందు బ్యాండుమేళం, భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు సినిమా పాట వాయిస్తోంది. అది చాలదన్నట్లు, వాళ్ళ వెనకాలే టపాకాయలు పేల్చేవాళ్ళు రాకెట్లని పేల్చున్నారు. పట్టపగలు కావడంతో, వాటి కాంతి స్ఫుటంగా కనిపించకపోయినా, శబ్దం మాత్రం చేస్తూ హడావుడి చేస్తున్నాయి. వీటికి తోడు మధ్య మధ్య ఆటంబాంబులని పేలుస్తుంటే, అవి పిడుగులలాగా, చెవులు అదరకొడుతున్నాయి. వీళ్ళ వెనకాల భజనమేళం. మెళ్ళో చిన్న హార్మోని వేసుకొని వాయించేది ఒకడు. మృదంగం వేసుకొని దరువులు వేసేది ఇంకొకరు. అంతా మొబైల్ కచేరి మొదలెట్టారు. వీళ్ళ వెనక నిప్పుతో వున్న కుండ పుచ్చుకొని సుదర్శనం, ఆయన పక్కన పురోహితుడు రామశాస్త్రి నడుస్తున్నారు. వీరి వెనకాల, అన్నివేపులా జనం, మధ్యన నలుగురు మోస్తుంటే, ఒక శవం సాగి వెళుతోంది. ఆశవం మీద చాలా ఖరీదైన పట్టుశాలువా కప్పి ఉంది. దానిపైన ఎన్నో పూలదండలు ముఖం కనిపించకుండా కప్పేశాయి. తలకి రెండువేపులా తట్టెడు తట్టెడు అగరువత్తులు ధూపాన్ని విరజిమ్ముతున్నాయి. శవం వెనకాల ఒక నడి వయస్కుడు, ఒక పళ్ళెంలోంచి పూలరేకులు చిల్లర పైసలు కలిపి ఉంచి, మధ్య మధ్య శవం మీదకి జల్లుతున్నాడు. శవంపై నుంచి పడే ఆ చిల్లర పైసల్ని ఏరుకోడం కోసం, పేదవాళ్ళు ముఖ్యంగా పిల్లలు పోటీపడి ఎగబడుతున్నారు.

ఆ శవం ఎవరిదో కాదు. ఆ వూరి పెద్ద వ్యాపారస్తుడయిన నారాయణరావు గారిది. ఏమీలేని కుటుంబంలో పుట్టిన వాడైనా స్వయం శక్తితో పైకి వచ్చినవాడు ఆయన. వ్యాపారంలో లక్షలకి లక్షలు గడించినా గర్వం మాత్రం ఆయన దరిచేరలేదు. "అన్నీ వున్న విస్తరి అణిగి మణిగే వుంటుం"దనే సామెత ఆయన విషయంలో సార్ధక మైంది.

వ్యాపారంలో ఏ గడ్డీ కరవకుండా న్యాయంగా సజావుగా బ్రతికాడు ఆయన. తన చేతి క్రింద ఎంతోమందికి ఉపాధి చూపించడమే కాకుండా, తన చేత్తో ఎందరెందరికో, ఎన్నో విధాల సహాయం చేశాడు. అందుకే ఆయన మరణించాడని తెలియగానే ఊరు ఊరంతా కదిలి వచ్చింది. ఎవరు సాగనంపగలిగినంత దూరం వారు శవం వెంట నడిచి, తమ అభిమానాన్ని చాటుకున్నారు.

శవం శ్మశానవాటిక చేరుకుంది. అక్కడికి వచ్చేసరికి, ఊరి జనం ఎవరి దారిన వారు తిరిగి వెళ్ళిపోయారు. కొడుకులు దగ్గర బంధువులు, ఆప్తమిత్రులు మాత్రం మిగిలారు.

శవ దహనం పూర్తి అయింది. నారాయణరావు గారి పెద్ద కొడుకు సుదర్శనం చేత స్మానంతో వంట వండించాడు బ్రాహ్మడు. ఈ కర్మకాండ పూర్తి అవడానికి చాలా వ్యవధి వుంది. ఈ లోపల శవం వెంట వచ్చినవారు, తులసి కోటలమీద చెట్లక్రిందా, అక్కడ వసారాలోనూ, ఎవరికి వీలయిన చోట వారు కూర్చుని లోకాభి రామాయణం మాట్లాడుకుంటున్నారు. సుదర్శనం, అతని తమ్ముళ్లు

ప్రసాద్, ప్రభాకర్, నరేంద్ర వాళ్ళ పినతండ్రులు రామ్మూర్తి, రంగనాథం, పురోహితుడు రామశాస్త్రి వసారాలో కూర్చున్నారు.

రామశాస్త్రిగారు అందుకొన్నారు. "ఏనుగు బ్రతికినా, చచ్చినా వెయ్యి వరహాలేనని, నారాయణరావు గారు చనిపోయినా కూడా ఎంత ఘనంగా పోయారు? ఊరూరంతా ఆయన వెంట కదిలి వచ్చింది. అందునే అన్నారు పెద్దవాళ్ళ చావు పెళ్ళితో సమానము అని".

"మా అన్నయ్య రాజాలాగా బ్రతికాడు. రాజాలానే పోయాడు" అని అన్నాడు రామ్మూర్తి.

"వారిమాట అటుంచండి. ఆయన పోయినా, ఏదో పెద్దవాడు పోయాడులే అని ఊరుకోక, మీరంతా ఎంత ఘనంగా అంత్యక్రియలు చేయిస్తున్నారు! ఆయన ఆత్మ ఎంతేనా సంతోషిస్తుంది' ' అన్నాడు రామశాస్త్రి గారు పొడుం పీలుస్తూ.

"అవన్నీ మనం అనుకోడం కాని పోయిన వాళ్ళు మనం ఏం చేస్తోంది చూడవచ్చా రటండీ!" అన్నాడు సుదర్శనం.

"అల్లా అనకు బాబు .. ప్రేతరూపంలో జీవుడు అన్నీ గమనిస్తుంటాడని, కాకులు ద్వారా తమ కోర్కెలు తెలియబరుస్తుంటారని పెద్దలు అంటారు. రేపు మీరు ఘనంగా అంత్యక్రియలు చేస్తూ, పదిమందిని పిలిచి భోజనాలు పెట్టుంటే ఆ మహానుభావుడి ఆత్మ శాంతించదూ!" అన్నాడు రామశాస్త్రిగారు లేచి.

"ఇవన్నీ అర్థంలేని మాటలు. ఊరివారిని మేపడం కోసం కాకపోతే ఏమిటండీ ఈ ఖర్చులు. ఇవాళన్నారూ .... పదిమందీ వచ్చారు కనుక బాగుండదని ఏదో ఘనంగా శవాన్ని సాగనంపాం. ఇది చాలక సంతర్పణలూ, మంది సమారాధలూ చేస్తే అయినట్లే. ఎవరు తిన్నట్లు?" అన్నాడు సుదర్శనం ముఖం చిట్లించుకుంటూ.

"అదేమిట్రా అల్లా అంటావు. ఆయనకోసం మీ జేబులోంచి ఖర్చు పెట్టున్నారా ఏమిటి! ఆయన సంపాదించాడు. అందులోంచే ఖర్చు పెట్టండి. నాన్నగారి విషయంలో ఏదో మొక్కుబడి చెల్లించినట్లు పెట్టే ఎల్లా!" అని మందలిచాడు రంగనాథం.

"ఎవరి డబ్బులోంచి అని కాదు బాబాయి, అనవసరపు ఖర్చు ఎందుకూ అని. ఆయన బ్రతికి వుండగా ఎన్నో దానధర్మాలు చేశాడు. అవి చాలదా? ఇంకా ఎందుకు చేతి చమురు వదుల్చుకోడం?" అన్నాడు సుదర్శనం తిరిగి.

"నాన్న పిచ్చి ఖర్చులు చేయకుండా ఉండిఉంటే ఈపాటికి మేము డబ్బులో దొర్లుతూ ఉండేవాళ్ళం. ఆయన దానధర్మాలు లెక్క వేసుకుంటే గుండె చెరువవుతుంది" అన్నాడు ప్రసాద్.

"ఇప్పుడు మాత్రం మీకు తక్కువ ఇచ్చాడుటర్రా! ఒక్కొక్కళ్ళకి లక్ష పైగా వస్తుంది. ఆయనైతే కష్టపడి స్వయంగా సంపాయించాడు. మీకు ఆ శ్రమ లేకుండా బోలెడంత ఇచ్చి పోయాడు. మీ తెలివితేట లుపయోగించి, దానిని మరింత చేయండి" అన్నాడు రామ్మూర్తి.

"బాబూ ..... నాన్నగారు బహు దొడ్డ ప్రభువులు. వారి విషయంలో అల్లా అనకండి. వారి గౌరవానికి తగ్గట్లుగా అంత్యక్రియలు జరిపించండి. మీరెంత ఖర్చుపెట్టినా అంతా వారిదేగా!" అన్నారు రామశాస్త్రిగారు.

"శాస్త్రిగారూ .... ఇది మా కుటుంబ విషయం. మీరు జోక్యం కల్పించుకోకండి" అన్నాడు ప్రసాద్ ముఖం చిట్లించుకుంటూ.

శాస్త్రిగారు చిన్నబుచ్చుకొని "మీ ఇంటికి ఆస్థాన పురోహితుడి లాంటి వాడ్ని కనక చెప్పాను

బాబూ! నాకెందుకు మీ ఇష్టం" అంటూ అన్నం ఉడికిందో లేదో చూడడానికి వెళ్ళారు.

"బాబూ! మూడు రోజుల్నించి కూడు లేదు. ఓ పైసా ధర్మం చేయండి" అంటూ ఒక బక్కచిక్కిన ముష్టివాడు అక్కడికి వచ్చాడు. ఎముకల పోగులాగా ఉన్న వాడికి కళ్లల్లో ప్రాణాలు ఉన్నాయి.

"ఒరే. రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పలేదన్నట్లు, స్మశానంలో కూడా నీ ముష్టి పీడేనా .... పో, పో" అని కసురుకున్నాడు సుదర్శనం.

"అడుక్కోడం మరిగిన వాడికి స్మశాన మేమిటి, ఊరేమిటి, మనం శవాన్ని తగలేస్తాం కనుక సరిపోయింది. పాతేస్తే తవ్వి పీక్కు తింటారు కూడా" అంటూ అసహ్యంగా అన్నకి వత్తాసు పలికాడు ప్రసాద్.

"బాబూ ... ఒక్క చిన్నపైస దానం చేయండి. కడుపు ఎండిపోతోంది" అటూ మళ్ళీ అందుకున్నాడు ఆ ముష్టివాడు.

"పోరా పో ... నీక్కాదూ .... ఇక్కడెవరి సొమ్మూ తేరగా లేదు" అంటూ కొట్టేట్టుగా అరిచాడు నరేంద్ర.

ముష్టివాడు చేసేది లేక దూరంగా పోయి కూర్చున్నాడు.

"బాబూ. అన్నం ఉడికింది. ఇంక రండి" అన్న శాస్త్రి గారి పిలుపుతో కదలివెళ్ళాడు సుదర్శనం.

మంత్రం చెప్పడం అయింతర్వాత కాకుల కోసం అన్నం వేయసాగారు శాస్త్రిగారు.

కొంచెం దగ్గిరగా వొచ్చి ఆశగా అన్నం వంక చూస్తూ "బాబూ ..... మీరు కాకులకి వేయగా మిగిలిన అన్నం ఈ ముష్టోడి ముఖాన ఎయ్యండి దొరా" ప్రాధయపడసాగాడు ఆ ముష్టివాడు.

"మళ్లా వచ్చావా? పొమ్మంటే నీక్కాదూ?' అంటూ అదలించాడు సుదర్శనం.

ముష్టివాడు వెళ్ళి తిరిగి తనస్థానంలో కూర్చున్నాడు.

అన్నం తీసి విడిగా దోనెలలో పెట్టి కాకులకోసం ఉంచి ఇవతలకి వచ్చారు రామశాస్త్రి గారు, సుదర్శనం.

ఆశ్చర్యం ...... చుట్టూ ఇరవై ముప్పై కాకులున్నా ఒక్కటి కూడా వచ్చి ముట్టుకోలేదు. ఆ అన్నం చుట్టూ తిరుగుతున్నాయే కాని, దొన్నెల దగ్గర మాత్రం వాలలేదు.

"నారాయణరావు గారి ఆత్మ ఏదో తీరని కోరికతో ఘోషిస్తోంది. ఆయన కోరిక తెలుసుకుని తీరుస్తామని మొక్కుకోండి బాబూ ..... లేకుంటే కాకి ముట్టదు" అన్నారు రామశాస్త్రి గారు.

"నాన్నకి ఇంకేం కోరిక ఉంటుందీ! చెల్లాయి పెళ్ళి కాలేదుగా. ఆ విషయమై దిగులు ఉండి వుంటుంది" అన్నాడు ప్రభాకర్.

"చెల్లాయి పెళ్ళి సలక్షణంగా చేస్తాం" అని గట్టిగానే అన్నాడు సుదర్శనం.

అయినా కాకులు ముట్టుకోలేదు.

"ఇంకేం అయ్యేంటుందబ్బా" అన్నారు రామశాస్త్రి గారు.

"ఇందాకటి నుంచి కర్మకాండ ఘనంగా చేయనక్కర్లేదని అనుకున్నారుగా. అందుకే ఆయనకి కోపం వచ్చి ఉంటుంది." అన్నారు రామ్మూర్తి గారు.

"ఆయన మనస్సు క్షోభ పెట్టడం ఎందుకు .... ఘనంగా చేస్తామని అనుకోండి," సలహా ఇచ్చారు రంగనాథం గారు.

అయిష్టంగానే "ఉత్తర క్రియలు ఘనంగా చేస్తాం" అన్నాడు సుదర్శనం.

అయినా కాకులు ముట్టుకోలేదు.

ఈవిధంగా, ఏ కారణాలు అయి ఉండవచ్చో ఊహించుకొని మొక్కులు ఎన్ని మొక్కుకున్నా కాకి మాత్రం ముట్టుకోలేదు.

"బాబూ .... కొంచెం అన్న ముద్ద పడేయండి. కళ్ళు తిరుగిపోతున్నాయి" అంటూ మళ్ళీ వచ్చాడు ముష్టివాడు.

"పోరా .... అసలే కాకులు ముట్టుకోలేదని మేము సతమతమవుతుంటే నీ గోలేమిటి?" అని గట్టిగా కసురుకున్నాడు సుదర్శనం.

కాకులు వాటిని ఎవరో కొట్టినట్లుగా కావు కావు మని అరవడం మొదలు పెట్టాయి.

"ఇంక ఎంతసేపు ఉంటాం. పోదాం పదండి. మనం ఇక్కడ ఉన్నామని భయంతో కాకులు ముట్టుకోడం లేదేమో!" అంటూ లేచాడు సుదర్శనం.

"అటువంటిదేమీ ఉండదు బాబూ ..... ఇప్పటికి ఎన్ని కర్మలు చేయించాను. ఎప్పుడూ జనాన్ని చూసి కాకులు తినక పోవడం లేదు. ఆయన మనస్సులో కోరిక ఏమిటలో మనకర్థం కావడం లేదంతే" అంటూ రామశాస్త్రి గారూ లేచారు.

ఆయనతోపాటు అందరూ లేచారు.

వాళ్ళు కొంచెం దూరం వెళ్ళగానే ముష్టివాడు, నెమ్మదిగా అన్నం కుండ దగ్గరకెళ్ళి, అందులోని అన్నం బొక్కడం మొదలుపెట్టాడు.

కాకులు అరుస్తూ దొన్నెల దగ్గర వాలాయి.

ఈ కాకిగోలకి అందరూ వెనక్కి తిరిగి చూశారు.

"అవుగో కాకులు అన్నం తింటున్నాయి. నేను చెప్పలా మనం ఉన్నామని భయపడుతున్నాయి. మాకు తెలియని కోరికలు నాన్నకేమున్నాయి?" అన్నాడు సుదర్శనం ఒక కొత్త విషయం కనుగొన్నట్లు.

రామశాస్త్రిగారు చిరునవ్వు నవ్వారు. "అది కాదు బాబూ ... అదుగో అక్కడ ముష్టివాడు అన్నం తింటున్నాడు. ఇందాకటి నుంచి వాడిని కసురుకున్నామని నారాయణరావు గారి మనస్సు క్షోభించింది. ఆ అన్నం ముద్ద వాడి నోటి కంటగానే ఆయన మనస్సు శాంతించింది. అందుకే మీరు ఎంత ఘనంగా కర్మకాండ చేసినా, పేదసాదలకి పెడితేనే ఆయనకు ఆత్మ తృప్తి చెందుతోంది. ఆయన మనస్సు నాకు బాగా తెలుసు" అన్నారు రామశాస్త్రిగారు.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

కొంచెంసేపాగి "పోనీలెండి. ఎలాగైనా కాకి ముట్టుకుంది. అంతే చాలు" అన్నారు రామ్మూర్తి గారు.

అందరూ మౌనంగా ముందుకు సాగారు.

*(సౌమ్య మంత్లీ, ఫిబ్రవరి 1979)*